క్లుప్తంగా

పీహెచ్‌సీలో బాలింతల కోసం ప్రత్యేక గది



బాలింతల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గది

పాయకరావుపేట: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా బాలింతల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని గురువారం ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చినప్పుడు బాలింతలు తమ పిల్లలకు పాలు పట్టేందుకు ఈ గదిని సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.సుభాష్, డాక్టర్ వి.ఎస్.సౌందర్య, ఎంపీహెచ్‌ఈవో డి.నెహూ, హెచ్‌ఎస్ ఎం.నాగేశ్వరరావు, ఏడబ్ల్యూ సూపర్‌వైజర్ కె.లలిత, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రీ-సర్వేలో లోపాలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రీ-సర్వే జరగనున్న గ్రామాల్లో రైతులకు ముందుగా సమాచారం అందించాలన్నారు. రీ-సర్వేలో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. నీటి తీరువా వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. డీటీ మురళీధర్, పలువురు వీఆర్వోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బీవోబీ ఆధ్వర్యంలో కుర్చీల వితరణ



కుర్చీలు అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా తోటాడ బ్రాంచి మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది

మునగపాక: బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) తోటాడ బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం కుర్చీల వితరణ జరిగింది. బ్యాంకు 118వ వార్షికోత్సవంలో భాగంగా తోటాడ ఆరోగ్య ఉప కేంద్రానికి, హైస్కూల్‌కు 15 కుర్చీల చొప్పున బ్రాంచి మేనేజర్ కాకినాడ రాజశేఖర్, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ యామిని ప్రియాంక, ఏఎన్‌ఎం భారతి, బుద్ధ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కోటవురట్ల: స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు గురువారం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుకుమార్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా.. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డ్రాయింగ్ టీచర్ కిషోర్ పర్యవేక్షించగా విద్యార్థులు తమలోని సృజనాత్మకతకు పదును పెడుతూ చిత్రాలు గీశారు. ఉపాధ్యాయులు కృష్ణ, నాగేశ్వరరావు, రాజీవ్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



వాహనాలను అడ్డగిస్తున్న మతిస్థిమితం లేని వ్యక్తి

మునగపాక: పూడిమడక రోడ్డు మునగపాకలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి గురువారం హల్‌చల్ చేశాడు. ఈయనను ఒడిశాకు చెందిన వ్యక్తిగా స్థానికులు గుర్తించారు. తెల్లవారు 3 గంటల నుంచి మునగపాకలో ఇరువైపులా రాకపోకలు సాగించే వారిని హడలెత్తించాడు. రోడ్డు మధ్యలో నిలబడి హల్‌చల్ చేయడంతో వాహనాలు నడిపేవారు కొంతసేపు ఇబ్బందులు పడ్డారు. కొన్ని గంటల తరువాత ఆయన వేరే ప్రాంతానికి వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గ్రావెల్ లారీకి రూ.10వేల జరిమానా

మునగపాక: మునగపాకలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని గురువారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి రికార్డులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీని పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. రూ.10వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు



మునగపాకలో చెరకు పంట

- ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభమైన పంటల వివరాల నమోదు
- ఇకపై బీడు భూములు, పశువుల పాకలకు కూడా వర్తింపు



మూలపేటలో ఈ-పంట నమోదు చేస్తున్న అధికారులు

మునగపాక: ఆరుగాలం శ్రమించే రైతులను నిరంతరం కష్టాలే వెంటాడుతుంటాయి. విత్తనం నాటిన నుంచి పంట చేతికి అందివచ్చేంత వరకు రైతుకు భరోసా దక్కడం లేదు. అతివృష్టి, అనావృష్టి సమయాల్లో రైతులు నష్టాల బారిన పడుతుంటారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం పొందేందుకు ఇబ్బందులు పడుతుంటారు. రైతులకు ఇటువంటి సమయంలో నష్టాలు రాకుండా ఉండేందుకు ఈ-పంట నమోదు ఆదుకుంటుంది.

ఈ-పంట నమోదు ఇలా..

రైతులు తాము పండిస్తున్న పంటలను అధికారుల ద్వారా నమోదు చేసుకోవచ్చు. పంట నష్టం పరిహారం పొందాలన్నా, ఇతర పథకాలకు అర్హత కావాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. ఇందుకోసం సచివాలయ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు గ్రామాల్లో వ్యవసాయ కమతాలకు చేరుకొని పంటల సాగు వివరాలు సేకరిస్తారు. అనంతరం ప్రత్యేక యాప్‌లో రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారో గుర్తించి అక్కడికక్కడే రైతు, పంట కలిపి ఫొటోను అప్‌లోడ్ చేస్తారు. ఏ సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణంలో పంట సాగు జరుగుతుందో నమోదు చేస్తారు.

ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ప్రారంభం

మండల వ్యాప్తంగా 21 సచివాలయాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఈ -పంట నమోదు చురుగ్గా సాగుతుంది. వరి సాగు ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు గ్రామాల్లోకి వచ్చి పంట వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు.

బీడు భూములు, పశువుల పాకలూ నమోదు

ఇప్పటి వరకు గ్రామాల్లో సాగుచేసే పంటలను మాత్రమే ఈ-పంట నమోదు చేస్తుండేవారు. అయితే కొత్తగా బీడు భూములు, పశువుల పాకలను కూడా ఈ-పంట నమోదు చేయాలన్న ఆదేశాలు వ్యవసాయ కార్యాలయానికి వచ్చాయి. దీంతో ఏయే పంటల సాగు చేస్తున్నారనే వివరాలతో పాటు అదనంగా బీడు భూములు, పశువుల పాకలు కూడా నమోదు చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఈ-పంట నమోదుతో లాభాలు

ఈ-పంట నమోదు ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అన్నదాత సుఖీభవ పథకం అందాలన్నా, సున్నా వడ్డీ రుణాలు, కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల నష్ట పరిహారం తదితర మేలు జరుగుతుంది. ఈ-పంట నమోదు లేకుంటే ఎటువంటి సాయం అందదు.

ప్రకృతి వైపరీత్యాలతో ఊరట



ఈ-పంట నమోదు చేసుకునే రైతులకు ప్రభుత్వ పథకాలతో పాటు సాయం అందుతుంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే ఈ-పంట నమోదు చేసుకున్న వారికి మాత్రమే పరిహారం అందుతుంది. ఈ-పంట నమోదు చేసుకోలేని రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం దక్కదు. అధికారులు పొలాల్లోకి వచ్చి పంటలు, బీడు భూములు, పశువుల పాకల వివరాలు నమోదు చేసుకునే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలి.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి,
వ్యవసాయాధికారి, మునగపాక మండలం

దంచికొట్టిన వాన



మండల పరిషత్ కార్యాలయం వద్ద మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

కోటవురట్ల: వరుణుడి రాకతో సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. మండలంలో పలు ప్రాంతాలలో గురువారం కుండపోత వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు, పంట కాలువల్లోకి వర్షం నీరు చేరింది. మండల పరిషత్ కార్యాలయం ఎదుట మెయిన్ రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అయితే ఈ వర్షం ఆకుమడులకు మేలు చేస్తుందని రైతులు భావిస్తున్నారు. నారుమడులు వర్షాభావ పరిస్థితులకు ఎండిపోతున్న తరుణంలో వర్షం ఊపిరిపోసిందని రైతులు చెబుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని కూటమి నాయకులు నాగేశ్వరరావు, సుందరపు సతీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు పోస్టర్‌ను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ఎమ్మెల్యే విజయకుమార్ జన్మదినం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఉమ్మలాడ శ్రీదేవీతల్లి సన్నిధిలో కుంకుమ పూజలు



శ్రీదేవీతల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



చండీహోమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో శ్రీదేవీతల్లి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమంతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్లె అప్పలనాయుడు, సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి, మొల్లేటి నారాయణరావు, శంకర్, నాయుడు, కరోతి విజయకుమార్, ఆటో శ్రీనివాసరావు, గణేష్, తదితరులు పాల్గొన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్తమ ఫలితాల కోసం కృషి



గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డైట్ లెక్చరర్ ఆనంద్‌రాజ్

కోటవురట్ల: ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని డైట్ లెక్చరర్ ఎం.ఆనంద్‌రాజ్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడారు. బోధనాపరమైన అంశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సదుపాయాలు, భోజనం తదితర అంశాలపై విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. అభ్యసనా సామర్థ్యాలను గుర్తించేందుకు ప్రశ్నలు వేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చదవడం, రాయడం, సంఖ్యలను గుర్తించడంలో నైపుణ్యం చూపించాలన్నారు. తెలుగు, ఇంగ్లిషు, గణితం సబ్జెక్టులలో సంసిద్ధతపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మెరుగైన ఫలితాల కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రధానంగా విద్యార్థినుల్లో క్రమశిక్షణ ఉండేలా కృషి చేయాలన్నారు.

మోసపూరిత పాలనలో చంద్రబాబు దిట్ట

- గ్రావెల్ మాఫియాను అధికారులు నివారించాలి
- నమ్ముకున్న కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం
- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ
- గ్రామాల్లో విస్తృతంగా 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాలు



ఎం.జగన్నాథపురం కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

అచ్యుతాపురం రూరల్ : మోసపూరిత పాలన చేయడంలో సీఎం చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని హరిపాలెం, మెలిపాక జగన్నాథపురం, నరేంద్రపురం, మళ్లవరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బాబు చేస్తున్న మోసాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మొదట్నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తున్న కార్యకర్తలకు ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా స్వలాభాల కోసం పార్టీలు మారే వారికి ఎప్పుడూ ప్రాధాన్యత ఉండదన్నారు. ఇది వరలో వెదురువాడలో జరిగిన గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న కో-ఆప్షన్ సభ్యులు నర్మాల కుమార్, గంగూలీ శ్రీను వంటి నాయకులను అభినందించారు. కూటమి నాయకులు చేస్తున్న అక్రమ గ్రావెల్ మైనింగ్‌పై అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకుల అక్రమ వ్యవహారాలను చూస్తుంటే ప్రజలకు ప్రభుత్వాలపై నమ్మకం పోతుందన్నారు. గ్రామాల్లో అన్ని విభాగాల్లో చురుగ్గా పనిచేసే 25 మందితో కూడిన సభ్యులను కమిటీలుగా ఏర్పాటు చేసి, వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, పార్టీ సీనియర్ నాయకుడు కోన లచ్చన్నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాము, పార్టీ నాయకులు మారిశెట్టి సూర్యనారాయణ, భీముని వెంకటేశ్వర్రావు, బలిరెడ్డి శ్రీను, రావి శోభన్‌బాబు, రవీంద్రరాజు, చోడిపల్లి దేముడు, దొడ్డి కృష్ణ, పీలా నర్సింగరావు, గొర్లి నూకరాజు, భీముని నాగేశ్వర్రావు అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుతో ప్రజల జీవనానికి ముప్పు



మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

పాయకరావుపేట: బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల జీవితాలకు ముప్పు తప్పదని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నట్టు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఈ ప్రాంత ప్రజలు చేస్తున్న నిరసన, ఆందోళనను రాష్ట్ర ప్రభుత్వం, హోంమంత్రి వంగలపూడి అనిత పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రయత్నాలను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాన్న రమేష్, నాయకులు శ్యాముల్ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం



చేనేత కార్మికులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక చేనేత కార్మికులను జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ కోన సంధ్య లచ్చన్నాయుడు సన్మానించారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పప్పు రాజారావు అధ్యక్షతన గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వైఎస్సార్‌పీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త రాజాన సన్యాసినాయుడు, పొన్నగంటి అప్పారావు, తిప్పాని అప్పారావు, వానపల్లి సూరిబాబు, మాడెం సూరి అప్పారావు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ



పూలు కొనుగోలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ప్రవదినాన్ని పురస్కరించుకుని గురువారం యలమంచిలి పట్టణంలో ప్రధాన రహదారికిరువైపులా మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పూజా సామగ్రి, గాజులు, పూలు, పండ్లు, పసుపు కుంకుమలు, చెరకు గడలు, చీర, రవికెలు వంటివి కొనుగోలు చేశారు. గిరాకీ దృష్ట్యా పూలు, పండ్లను వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. కొనుగోలుదారులతో ప్రధాన రహదారిపై రద్దీ కనిపించింది.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయం, పాటించాల్సిన మెలకువల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఉన్న కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతం, వేప గింజల కషాయం తయారీరై అవగాహన కల్పించారు. జీవామృతం వల్ల పురుగులు, తెగుళ్లను నివారించడంలో, మొక్క పెరుగుదలను మెరుగుపరుస్తుందని సిబ్బంది చెప్పారు. మండల సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.ఉమాప్రసాద్, వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ, ఏఈవో నాగమణి, ఆత్మ సిబ్బంది అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ పి.సత్యవేణి, సర్పంచ్ నఖిలేటి రాము, ఎంపీటీసీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు



రెగ్యులేటర్ పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: సాగునీటి వనరుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. మండలంలోని పురుషోత్తపురం శివారు కుమారపురం వద్ద అనకాపల్లి ఆవ కాలువ హెడ్ రెగ్యులేటర్ పునరుద్ధరణ పనులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్ సహకారంతో నియోజకవర్గంలో సాగునీటి సమస్యలు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.15.34 లక్షల వ్యయంతో రెగ్యులేటర్ పునరుద్ధరణ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి పెదబ్బాయి, కాళ్ల చంద్రమోహన్, కర్రి ఉస్తేల్‌నాయుడు, ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన భారీ వృక్షం.. తప్పిన పెను ప్రమాదం



పట్టణంలో కార్ల స్టాండు వద్ద కూలిన భారీ వృక్షం

యలమంచిలి రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారి కార్ల స్టాండు పక్కన ఉన్న భారీ గంగిరావి చెట్టు గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా నేలకొరిగింది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో కూలిన చెట్టు కొమ్మలు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లపై పడడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న వారంతా భయంతో పరుగులు పెట్టారు. ఆ సమయంలో అక్కడ తక్కువ సంఖ్యలో జనసంచారం ఉండడంతో పాటు వాహనాలు కూడా తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. చెట్ల కొమ్మలు ప్రధాన రహదారిపై పడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమాచారం తెలుసుకున్న విద్యుత్, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా వాహనాల రాకపోకలను గాంధీనగరం, రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా మళ్లించారు. అనంతరం జేసీబీ, మినీ ఎక్స్‌కేవేటర్, రంపాల సాయంతో కూలిన చెట్టు కొమ్మలు, మానును ముక్కలుగా నరికించి ట్రాక్టర్లతో తరలించి ప్రధాన రహదారిపై రాకపోకలు పునరుద్ధరించారు. ఈ వృక్షం కూలిన చోట ప్రధాన రహదారి పక్కన పలువురు వ్యాపారులు కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు విక్రయిస్తుంటారు. వాటిని కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో జనం కూడా వస్తుంటారు. అయితే వారం రోజుల క్రితం రోడ్డు పక్కన ఆక్రమణల తొలగింపులో భాగంగా వీధి వ్యాపారులను దూరంగా వెళ్లిపోవాల్సిందిగా అధికారులు చెప్పారు. దీంతో తామంతా వ్యాపారాలు జరక్క ఉపాధి కోల్పోతున్నామని చిరు వ్యాపారులంతా ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గురువారం వృక్షం కూలిన చోట వ్యాపారాలు చేసే వారంతా ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నామని ఊపిరి పీల్చుకున్నారు.